సాక్షి
అనకాపల్లి
బుధవారం । 9 । ఏప్రిల్ । 2025







సింహగిరి మాడ వీధుల్లో రథోత్సవం

వాతావరణం

	గరిష్ఠం/కనిష్ఠం
అనకాపల్లి	35.6/24.0
చోడవరం	37.0/29.0

రాగల ఐదు రోజులు జిల్లాలో ఆకాశం పొడిగా ఉండి, అక్కడక్కడ చెదురుమదురు జల్లులు కురిసే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

నేత్రపర్వంగా అప్పన్న కల్యాణోత్సవం

- నందడిగా ఎదురు సన్నాహోత్సవం
- హరినామస్మరణతో మార్మోగిన సింహగిరి
- ఉత్సాహంగా రథోత్సవం.. పరవశించిన భక్తజనం
- భక్తులకు ముత్యాల తలంబ్రాల పంపిణీ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం రాత్రి కనులవండువగా జరిగింది. భూదేవి, శ్రీదేవి సమేత అప్పన్న స్వామి కల్యాణాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తుల హరి నామస్మరణలతో సింహగిరి మార్మోగింది. పాంచరాత్ర ఆగమ శాస్త్రాన్ని అనుసరించి కల్యాణోత్సవ ఘట్టాలను ఆలయ అర్చకులు మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించారు. తొలుత ఆలయ నీలాద్రిగుమ్మం వద్ద అర్చకులు, ముత్తయిదువులు పసుపుకొమ్ములను దంచి కొట్నాల ఉత్సవాన్ని నిర్వహించారు. తదుపరి ముక్కోటి దేవతలకు కల్యాణోత్సవ ఆహ్వానాన్ని పలుకుతూ ఆలయ ధ్వజస్తంభం వద్ద అర్చకులు గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేసి ధ్వజారోహణ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వాద సంవాదాలతో సందడిగా ఎదురు సన్నాహం

ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని బంగారురంగు పల్లకీలో, శ్రీదేవి, భూదేవి అమ్మవార్లను ముత్యాల పల్లకీలో వేంజేపచేశారు. అమ్మవార్ల పల్లకీని, అయ్యవారి పల్లకీని సింహగిరి మాడ వీధుల్లో చెరొకవైపు తీసుకెళ్లి పశ్చిమ మాడ వీధిలో జోడుభద్రాల వద్ద ఎదురెదురుగా ఏర్పాటు చేసిన వేదికపై ఉంచారు. అక్కడ ఎదురు సన్నాహోత్సవం వాద, సంవాదాలతో ఆహ్లాదకరమైన వాతావరణంలో భక్తుల ఆనందోత్సాహాల మధ్య వేడుకగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పూలదండలతో నృత్యాలు చేస్తూ ఎదురు సన్నాహోత్సవాన్ని రక్తి కట్టించారు. వ్యాఖ్యాతలుగా తిరుమల తిరుపతి దేవస్థానం పరిచారకుడు కె.ఇ.లక్ష్మీనరసింహన్,



హాజరైన భక్త జనం

నరసాపురానికి చెందిన ఆధ్యాత్మికవేత్త వంగల వెంకటాచార్య స్వామి వ్యవహరించారు.

కనుల పండువగా రథోత్సవం

సింహగిరి మాడ వీధిలో పెద్ద ఎత్తున రథోత్సవం నిర్వహించారు. స్వామి ఉత్సవమూర్తులను రథంలో వేంజేపచేశారు. జాలరి పెద్ద కదిరి లక్ష్మణరావు రథసారధిగా నిలిచి రథ కదలికలను సూచిస్తుండగా, లక్ష్మీదేవి అమ్మవారి బంధువులుగా విశాఖ నగరం నలుమూలల నుంచి వచ్చిన జాలర్లు రథం నడిపే బాధ్యతలు చేపట్టారు. అశేష భక్తజనం స్వామి రథాన్ని తాళ్లతో లాగి పరవశించారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రథోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. తాడేపల్లిగూడేనికి చెందిన రాజరాజేశ్వరి కాళీమాత ట్రూప్ బృందంచే కాంతారా డ్యాన్స్, గోపాలపట్నంకి చెందిన శ్రీమన్నారాయణ కోలాటం బృందం ప్రదర్శన, ఎస్.కోటకి చెందిన పార్వతీపరమేశ్వర ట్రూప్‌చే చెక్కభజన తదితర కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కమనీయం.. రమణీయం..

సింహగిరిపై ఉత్తరరాజగోపురం ఎదురుగా ఉన్న ప్రాంగణంలో రాత్రి 10.30 గంటల నుంచి వార్షిక కల్యాణోత్సవం నిర్వహించారు. స్వామిని, అమ్మవార్లను కల్యాణ ప్రాంగణంలోకి తీసుకొచ్చి భారీ ఎత్తున ఏర్పాటు చేసిన కల్యాణ వేదికపై వేంజేపచేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగల్య ధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. తదుపరి భక్తులకు ముత్యాల తలంబ్రాలు, ప్రసాదం అందజేశారు. దేవస్థానం స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్, ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకులు, వేదపండితులు కార్యక్రమాన్ని నిర్వహించారు. రథోత్సవం, కల్యాణోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం దేవస్థానం ఈవో కె.సుబ్బారావు ఆధ్వర్యంలో విశేషంగా ఏర్పాట్లు చేశారు. గోపాలపట్నం లా అండ్ ఆర్డర్ సీఐ గొలగాని అప్పారావు బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

న్యూస్‌రీల్

కూలి డబ్బులు ఇవ్వండి మహాప్రభో!



దండం పెడుతూ నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

ఎస్.రాయవరం: దండం పెడతాం మా కూలీ డబ్బులు ఇప్పించడంటూ.. ఉపాధి కూలీలు వినూత్నంగా నిరసన తెలిపారు. సైతారుపేట, పేటసూధిపురం గ్రామాల్లో పనిచేస్తున్న ఉపాధి కూలీలు కూలి డబ్బులు చెల్లించాలంటూ మంగళవారం ప్రభుత్వ పెద్దలకు దండం పెడుతూ ఆవేదన వ్యక్తం చేశారు. సుమారు నాలుగు నెలలుగా కూలి నగదు చెల్లించకుంటే ఎలా బతకాలని దుయ్యబట్టారు. అభివృద్ధికి అడవుల్లో వేల కోట్లు ఖర్చు చేశామని గొప్పలు చెప్పుకునే ప్రభుత్వ పెద్దలకు కూలోడి గోడు వినిపించదా అని ప్రశ్నించారు. వేలకు వేలు జీతం వచ్చే ఉద్యోగికి ఒకరోజు జీతం ఆలస్యమయితే సరిచేస్తామన్న చంద్రబాబుకి.. పేదోడి ఆకలి తెలియదా అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

11న మహాత్మా జ్యోతిబా ఫూలే జయంతి వేడుక

తుమ్మపాల: ఈ నెల 11వ తేదీన మహాత్మా జ్యోతిబా పూలే 199వ జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. అనకాపల్లి పట్టణంలో స్థానిక గుండాల జంక్షన్ వద్ద గల ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర పండుగగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పొట్ట కూటికి వెళ్లి అనంత లోకాలకు..

- ఒకే గ్రామానికి చెందిన ఇద్దరూ వేర్వేరు ప్రాంతాల్లో మృతి





లక్ష్మీనారాయణ, శ్రీను (ఫైల్)

బుచ్చెయ్యపేట: బంగారుమెట్ట గ్రామానికి చెందిన ఇద్దరు పొట్ట కూటి కోసం వెళ్లి వేర్వేరు గ్రామాల్లో గుండెపోటుతో మృత్యువాత పడ్డారు. మేరుగు శ్రీను(28) పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. అరకులో పెయింటింగ్ పని కోసం వెళ్లి సోమవారం పనులు చేస్తుండగా కుప్పకూలిపోయాడు. స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేలోపే అతను మృతి చెందాడు. లక్ష్మీనారాయణ విశాఖలో కార్పెంటర్ పనులు చేస్తుంటాడు. మధురవాడ వద్ద నడిచి వెళ్తుండగా గుండెపోటుతో రోడ్డుపక్కనే కుప్పకూలి మృతి చెందాడు. లక్ష్మీనారాయణకు భార్య, ఇద్దరు కుమార్తెలుండగా.. శ్రీనుకు తండ్రి ఉన్నాడు. కుటుంబాన్ని పోషించే పెద్ద దిక్కు మృతి చెందడంతో ఈ రెండు కుటుంబాలు బోరున విలపిస్తున్నాయి. వీరిద్దరి మృతదేహాలకు మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు.

క్రిస్టల్ ఫార్మా కార్మికుడి మృతి

- యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని సిటు ఆరోపణ



మృతుడు మంగురాం (ఫైల్)

అచ్యుతాపురం రూరల్: సెజ్‌లో గల క్రిస్టల్ ఫార్మా యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగా జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన వలస కార్మికుడు మంగురాం తొపెయ్ (32) మృతి చెందినట్లు సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము ఆరోపించారు. ఈ నెల 1న మంగురాం కంపెనీలో విధులు నిర్వహిస్తుండగా అస్వస్థతతో కళ్లు తిరిగి పడిపోయాడని, స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా నామమాత్ర చికిత్స చేసి పంపించేశారన్నారు.
మంగురాంకి సరైన చికిత్స అందకపోవడంతో నాలుగైదు రోజుల అనంతరం మళ్లీ అస్వస్థతకు లోనయ్యాడని, విశాఖ కిమ్స్ ఆస్పత్రికి, అనంతరం కేజీహెచ్‌కి తరలించినా ప్రయోజనం లేకపోయిందన్నారు. సోమవారం రాత్రి మంగురాం కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఫ్యాక్టరీ యాజమాన్యాలు మల్టీ స్పెషాలిటీగా చెప్పుకునే స్థానిక ప్రైవేట్ ఆస్పత్రులతో సంబంధాలు పెట్టుకొని ఇక్కడి వైద్యంతో సరిపెడుతున్నాయని, దాంతో కార్మికుల జీవితాలు గాల్లో కలిసిపోతున్నాయని ఆరోపించారు.

రియల్.. కుదేల్

రిజిస్ట్రార్ కార్యాలయాలు కళ తప్పాయి. స్థిరాస్తి వ్యాపారం పతనం కావడంతో క్రయవిక్రయాలు క్షీణించాయి. కూటమి ప్రభుత్వ హయాంలో తమ కార్యకలాపాలు కుప్పకూలిపోయాయని రియల్టర్లు వాపోతున్నారు. పెట్టిన పెట్టుబడి రాకపోగా వడ్డీలు కట్టలేక అప్పుల పాలై గగ్గోలు పెడుతున్నారు.

- స్థిరాస్తి వ్యాపారం నేల చూపులు
- కూటమి ప్రభుత్వంలో కుప్పకూలిన రియల్ ఎస్టేట్ రంగం
- భూముల విలువ పెంచినా.. తగ్గిన ఆదాయం
- క్షీణించిన క్రయవిక్రయాలు.. వ్యాపారులకు ఇబ్బందులు



2023-24లో లక్ష్యం రూ.370.57 కోట్లు..
ఆదాయం రూ.278.46 కోట్లు
అచీవ్‌మెంట్ 75.14 శాతం

2024-25లో లక్ష్యం రూ.408.25 కోట్లు
ఆదాయం రూ.270.73 కోట్లు
భూముల విలువ రెట్టింపు చేసినా లక్ష్యంలో 66.3 శాతమే వచ్చింది.

సాక్షి, అనకాపల్లి:

రాష్ట్రంలో కూటమి సర్కారు ఏర్పడడంతోనే రియల్ ఎస్టేట్ రంగానికి గ్రహణం పట్టింది. పది నెలల కాలంలో క్రమంగా క్షీణించి.. భూముల విలువ ఇబ్బడి ముబ్బడిగా పెంచినా ఫలితం లేకపోయింది. సంపద సృష్టిస్తానన్న చంద్రబాబు తన విధానాలతో అన్ని రంగాల వారిని వెనక్కు నెట్టడంతో ఆ ప్రభావం.. డబ్బులతో ముడిపడిన స్థిరాస్తి రంగంపై పడింది. అనకాపల్లి జిల్లాలో 2024–25 ఆర్థిక సంవత్సరానికి రూ.408.25 కోట్ల ఆదాయం సమకూర్చుకోవాలని ప్రభుత్వం టార్గెట్ విధించింది. కానీ వచ్చింది కేవలం రూ.270.73 కోట్లు మాత్రమే. అంటే కేవలం 66. 3 శాతం మేరకే లక్ష్యాన్ని సాధించగలిగారు. సాధారణంగా గత ఏడాది వచ్చిన నికర ఆదాయాన్ని బట్టి ఈ ఏడాది టార్గెట్ నిర్ణయిస్తారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో అచీవ్‌మెంట్ 75.14 శాతం ఉంది. దాని ప్రకారమే ఈ ఏడాది రూ.408.25 కోట్లు లక్ష్యంగా పెట్టుకున్నారు. భూముల విలువ పెంచినా గత ఏడాది వచ్చినంత కూడా రాక పోవడాన్ని బట్టి స్థిరాస్తి విక్రయాలు ఏ స్థాయికి పడిపోయాయో అర్థం చేసుకోవచ్చు. రాబడిని పెంచేందుకు ఎన్ని ప్రయత్నాలు చేసినా ఫలితం కనిపించలేదు. రియల్ రంగానికి ఎప్పుడు మంచి రోజులు వస్తాయోనని వ్యాపారులు, మధ్యవర్తులు, ఈ రంగంపై పరోక్షంగా ఆధారపడినవారు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సంపద ఏది బాబూ..




కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే విశాఖకు బహుళజాతి కంపెనీలు క్యూలు కడతాయని ఎన్నికలకు ముందు ఊదరగొట్టారు. ఐటీ, ఐటీయేతర, ఫార్మా, డేటా సెంటర్ల పెట్టుబడుల వరద ముంచెత్తుతుందని చెవులకు చిల్లులు పడేలా బాకాలు ఊదారు. సంపద సృష్టించి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి మించిన సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రజల నోట్లో బూర్లు వండేశారు. అలవికాని హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం 10 నెలల కాలంలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాల సంపద ఆవిరైపోతోంది. అన్ని వ్యాపార రంగాలు తిరోగమన బాట పడుతున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి తగ్గిపోయింది. మార్కెట్లు డీలా పడిపోయాయి. ఈ ప్రభావం జిల్లాలో స్థిరాస్తి రంగంపై పడింది.

2024-25లో సబ్ రిజిస్ట్రార్ ఆఫీసుల వారీగా ఆదాయం వివరాలు..

ఎస్ఆర్‌వో	లక్ష్యం (రూ.కోట్లు)	ఆదాయం (రూ.కోట్లు)	అచీవ్‌మెంట్ శాతం
అనకాపల్లి	91.41	55.31	60.52
చోడవరం	19.92	15.85	79.58
కె.కోటపాడు	7.97	8.30	104.05
కోటవురట్ల	16.38	12.62	77.06
మాడుగుల	8.82	4.83	54.81
నర్సీపట్నం	33.90	21.59	63.68
నక్కపల్లి	37.90	26.85	70.84
సబ్బవరం	41.21	27.50	66.74
యలమంచిలి	66.81	43.58	65.74
లంకెలపాలెం	83.88	54.26	64.69

వైఎస్సార్‌సీపీ హయాంలో పెరిగిన రియల్ ఎస్టేట్..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో స్థిరాస్తి రంగం పుంజుకుంది. విశాఖను పరిపాలన రాజధానిగా ప్రకటించిన తరువాత రియల్ ఎస్టేట్ పరుగులు తీసింది. శివారు ప్రాంతాల్లో సైతం భూములకు డిమాండ్ పెరిగింది. కొత్త జిల్లా ఏర్పడిన తర్వాత జీవీఎంసీ పరిధిలోని అనకాపల్లితోపాటు జిల్లాలోని యలమంచిలి, పరవాడ, చోడవరం, నర్సీపట్నం, పాయకరావుపేట ప్రాంతాల్లో 'రియల్' రంగం బాగా పుంజుకుంది. 16వ నంబరు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న భూములు, ప్రత్యేక ఆర్థిక మండలి ఏర్పాటైన అచ్యుతాపురంలో భూములు, ఇళ్ల ధరలు పెరిగాయి. రియల్ ఎస్టేట్ వ్యాపారులు బాగా గడించారు. వారిని చూసి మరికొందరు ఈ వ్యాపారంలో దిగారు. ప్రైవేటుగా ఫైనాన్స్ తెచ్చి పెట్టుబడులు పెట్టారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పరిస్థితి ఒక్కసారిగా మారిపోయింది.
విశాఖ రాజధానిగా అయ్యే అవకాశం లేదని అందరూ భావించడంతో.. రియల్ ఎస్టేట్ పూర్తిగా కుదేలైంది. ప్రస్తుతమున్న ప్రాజెక్టుల్లోనే ప్లాట్లు, వెంచర్లలో ప్లాట్ల విక్రయాలు గణనీయంగా పడిపోయాయి. కొత్తగా వెంచర్లు, నిర్మాణాలకు ఎవరూ సాహసించడం లేదు. దీంతో జిల్లాలో ఆస్తుల క్రయ, విక్రయాలు తగ్గిపోయాయి.



రేట్లు పెరగడంతో సేల్స్ తగ్గాయి..



ఈ ఏడాది భూముల రేట్లు బాగా పెరగడంతో సేల్స్ తగ్గాయి. భూముల విలువ పెంచడంతో ఆదాయం పెరగాలి. కానీ క్రయవిక్రయాలు తగ్గడంతో ఆదాయం పడిపోయింది. అవసరాల నిమిత్తం భూములు అమ్ముకునే వారు తప్ప.. పెద్ద స్థాయిలో కొనేవారే కరువయ్యారు. మారుమూల గ్రామాల్లో భూముల విలువ, రిజిస్ట్రేషన్ చార్జీలు తగ్గిస్తే రియల్ ఎస్టేట్ రంగం పుంజుకునే అవకాశం ఉంది.

– రాజుల నాయుడు, డాక్యుమెంట్ రైటర్, కోటవురట్ల

మందగించిన రిజిస్ట్రేషన్లు



గత కొన్ని నెలలుగా రియల్ ఎస్టేట్ మందగించడంతో క్రయవిక్రయాలు జరగలేదు. మీడియేటర్ల పరిస్థితి మరింత దారుణంగా ఉంది. వెంచర్లు చూడడానికి కూడా కొనుగోలుదారులు రావడం లేదు. రియల్ ఎస్టేట్ పడిపోవడం కారణంగా మాతోపాటు ఈ రంగంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆధారపడి ఉన్న ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి.

– సేనాపతి రాము, రియల్టర్, యలమంచిలి

పరిహారం చెల్లించాకే పనులు

- రాజయ్యపేటలో ఏపీఐఐసీ అధికారులను అడ్డుకున్న మత్స్యకారులు



మత్స్యకారులతో చర్చలు జరుపుతున్న రెవెన్యూ, పోలీసు అధికారులు

నక్కపల్లి: తమ డీ ఫారం భూముల్లో ఉన్న చెట్లకు, సాగులో ఉన్న ప్రభుత్వ భూములకు నష్టపరిహారం చెల్లించిన తర్వాతే రోడ్డు పనులు ప్రారంభించాలని పలువురు మత్స్యకారులు డిమాండ్ చేశారు. పరిహారం చెల్లించకుండా పనులు ప్రారంభించడాన్ని వారు అడ్డుకున్నారు. రాజయ్యపేటలో సర్వే నెంబరు 290లో ఉన్న సుమారు 70 ఎకరాల ప్రభుత్వ డీఫారం భూములను మత్స్యకారులకు పంపిణీ చేయడం, వారు అక్కడ జీడి, మామిడితోటలు పెంచుకుని సాగుచేసుకుంటున్న విషయం తెలిసిందే. ఏపీఐఐసీ వారు బల్క్‌డ్రగ్ పార్క్ కోసం ఈ భూములు సేకరించారు. కేవలం భూములకు మాత్రమే నష్టపరిహారం చెల్లించారు. వాటిలో ఉన్న చెట్లకు పరిహారం చెల్లించకుండా కొద్దిరోజుల నుంచి ఏపీఐఐసీ వారు యంత్రాలతో చెట్లను తొలగించి రోడ్లు నిర్మిస్తున్నారంటూ మంగళవారం మత్స్యకారులు పనులు అడ్డుకున్నారు. ఏపీఐఐసీ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నక్కపల్లి, ఎస్.రాయవరం సీఐలు కుమారస్వామి, రామకృష్ణ తమ సిబ్బందితో చేరుకున్నారు. తహసీల్దార్ ఆర్.నర్సింహామూర్తి ఈ భూముల వద్దకు వచ్చారు. సీపీఎం నాయకులు అప్పలరాజు తదితరులు మత్స్యకారుల వద్దకు వెళ్లి వారికి అండగా నిలిచారు. మత్స్యకారులంతా యంత్రాల ముందు నిలబడి పనులు నిలుపుదల చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తహసీల్దార్, సీఐలు మత్స్యకారులతో చర్చలు జరిపారు. చెట్లకు పరిహారం విషయం ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని, సాగులో ఉన్న రైతుల వివరాల నమోదు కోసం సర్వే చేస్తామని చెబుతూ.. అప్పటి వరకు ఈ వివాదాస్పద భూముల్లో పనులు తాత్కాలికంగా నిలిపివేయడానికి అధికారులు అంగీకరించారు.

ప్రైవేటు ఆస్పత్రులకు డెలివరీ కేసులు

- దారి మళ్లిస్తున్న ప్రభుత్వ సిబ్బందిపై కఠిన చర్యలు
- సమగ్ర విచారణకు స్పీకర్ అయ్యన్నపాత్రుడి ఆదేశం
- నర్సీపట్నంలో ఆయుర్వేద ఆస్పత్రి ప్రారంభం



ఆస్పత్రిని ప్రారంభిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయ కృష్ణన్

నర్సీపట్నం: ప్రైవేటు ఆస్పత్రులకు రిఫర్ చేసిన డెలివరీ కేసులపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని స్పీకర్ సిహెచ్.అయ్యన్నపాత్రుడు వైద్యాధికారులను ఆదేశించారు. ఏరియా ఆస్పత్రిలో మంగళవారం కలెక్టర్ విజయ కృష్ణన్ సమక్షంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆశా వర్కర్లు ప్రభుత్వ ఆస్పత్రికి తక్కువగా డెలివరీ కేసులు పంపించి, ప్రైవేటు హాస్పిటల్స్‌కు ఎక్కువ కేసులు తరలిస్తున్నట్లు తన దృష్టికి వచ్చిందన్నారు. గత ఏడాది 398, ఈ ఏడాది 498 డెలివరీ కేసులు నర్సీపట్నంలోని ప్రముఖ ప్రైవేట్ హాస్పిటల్స్‌కు వెళ్లాయని స్పీకర్ పేర్కొన్నారు. దీనిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నాతవరం పీహెచ్‌సీలోని ఫార్మసిస్ట్ జాగరాపు వెంకటరావుపై వస్తున్న ఫిర్యాదులపై డీఎంహెచ్‌వో 24 గంటల్లో చర్యలు తీసుకోవాలని స్పీకర్ ఆదేశించారు. కనీసం మూడు నెలలకొకసారి ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో జ్యోతిని ఆదేశించారు. సీఎస్ఆర్ గ్రాంట్ ద్వారా రూ.35 లక్షల విలువైన ఆధునిక అంబులెన్స్‌ను మంజూరు చేసిన కలెక్టర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సోలార్ వేడి నీటి గ్రీజర్లను ఏర్పాటు చేయాలని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు.

త్వరలో పంచకర్మ సేవలు

ఏరియా ఆస్పత్రి ఆవరణలో రూ.29 లక్షలతో నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను స్పీకర్ అయ్యన్నపాత్రుడు, కలెక్టర్ విజయ కృష్ణన్ ప్రారంభించారు. హాస్పిటల్ నిర్మాణానికి సహకరించిన కలెక్టర్‌ను స్పీకర్ దంపతులు సత్కరించారు. ఈ హాస్పిటల్‌లో దీర్ఘకాలిక వ్యాధులకు ఆయుర్వేద వైద్య విధానంలో మందులు అందించనున్నట్లు తెలిపారు. చర్మవ్యాధులతో పాటు అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేద చికిత్స అందుబాటులో ఉంటుందన్నారు. త్వరలోనే ఆయుర్వేద ఆస్పత్రిలో పంచకర్మ సేవలు ప్రారంభిస్తామన్నారు. అనంతరం విద్యార్థుల యోగాసనాలను తిలకించారు. ఈ కార్యక్రమంలో డీసీహెచ్‌వో డాక్టర్ శ్రీనివాసరావు, ఆయుష్ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ ఝాన్సీలక్ష్మి, ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుధాశారద, డాక్టర్ యశోదదేవి, డాక్టర్ దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా శివపార్వతుల కల్యాణం

- వేడుకగా ఎదుర్కోలు ఉత్సవం


ఉపమాకలోని శివాలయంలో స్వామివారి కల్యాణం

నక్కపల్లి: పురాతన శివాలయం ఉపమాకలో ఉన్న శ్రీ భువనేశ్వరి సమేత లక్ష్మణేశ్వర స్వామి వారి ఆలయంలో వార్షిక కల్యాణం మంగళవారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. ఈనెల 8నుంచి 12వ తేదీ వరకు స్వామివారి కల్యాణోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ఉదయం అంకురార్పణ చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి ఆరు గంటల వరకు ఆలయంలో గణపతి పూజ, శుద్ధి పుణ్యాహవచనం కార్యక్రమాలు జరిగాయి. అంకురార్పణ అనంతరం స్వామివారిని సప్పరం వాహనంలోను, అమ్మవారిని పల్లకిలో ఉంచి నక్కపల్లి ఎదురు సన్నాహ మహోత్సవ కార్యక్రమానికి తీసుకువచ్చారు. మైలవరభట్ల జోగారావు ఇంటి వద్ద ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహించారు. ఈ పెళ్లిమాటల తంతును ప్రముఖ వేదపండితురాలు, ప్రవచనకర్త డాక్టర్ వేదాల గాయత్రీదేవి వ్యాఖ్యానంలో జరిగింది. స్వామి, అమ్మవార్ల గుణగణాలను భక్తుల కళ్లకు కట్టినట్టు వివరించారు. పెళ్లి కుమారుడి తరపున నక్కపల్లికి చెందిన శింగంశెట్టి వారి కుటుంబీకులు, పెళ్లి కుమార్తె తరపున ఎం.వి.వి.ఎస్ మూర్తి(సహరా పంతులు) వారి కుటుంబ సభ్యులతో ఎదురు సన్నాహ మహోత్సవం నిర్వహించడం జరిగింది. అనంతరం శింగంశెట్టి కుటుంబీకులతో ప్రసాద వినియోగం జరిగింది. ఉపమాకలో స్వామివారి ఆలయంలో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన కల్యాణ వేదిక వద్ద శివపార్వతుల కల్యాణం కొప్పిశెట్టి వెంకటేష్ దంపతుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా నిర్వహించారు. 9వ తేదీన కుంకుమ పూజ, 10వ తేదీన సదస్యం, 11న తోట ఉత్సవం, 12న పూర్ణాహుతి స్వామివారి పుష్ప యాగోత్సవం, పవళింపు సేవ జరుగుతాయని కార్యనిర్వాహణాధికారి మురళీకృష్ణ తెలిపారు. పార్వతీ పరమేశ్వరుల కల్యాణం తిలకించేందుకు నక్కపల్లి, ఉపమాకల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. ఈ కల్యాణోత్సవంలో ఉపమాక దేవస్థానం అర్చకులు గొట్టుముక్కల వరప్రసాద్ శేషాచార్యులు, వి.మహేష్ ఆచార్యులు, పసర కొండ పండు ఆచార్యులు, ఉపమాక దేవస్థానం మాజీ చైర్మన్‌లు, కొప్పిశెట్టి కొండబాబు, బుజ్జి, బ్రాహ్మణ సంఘ ప్రతినిధులు డి.వి.రామారావు, శ్రీపాద ప్రణవ్‌రామ్, శివాలయం మాజీ చైర్మన్ వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు కె.హరిబాబు పాల్గొన్నారు.

గంజాయిని తుదముట్టించేలా..

- అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలి
- ప్రజలు సమాచారం తెలిపేందుకు టోల్ ఫ్రీ నంబరు 1972
- నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో కలెక్టర్ విజయ కృష్ణన్


టోల్ ఫ్రీ నంబర్ ప్రచార పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ విజయ కృష్ణన్, ఎస్పీ తుహిన్ సిన్హా

తుమ్మపాల: అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి గంజాయి రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలని కలెక్టర్ విజయ కృష్ణన్ పిలుపునిచ్చారు. మంగళవారం కలెక్టరేట్‌లో ఎస్పీ తుహిన్ సిన్హాతో కలిసి ఆమె పోలీస్, సెబ్, ఆర్టీసీ, వైద్య ఆరోగ్య శాఖ, అటవీ శాఖ, కోస్ట్ గార్డ్, మెరైన్, జీఆర్పీ, మత్స్య శాఖల అధికారులతో జిల్లా స్థాయి నార్కో కోఆర్డినేషన్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాఠశాలలు, కళాశాలలు, వసతిగృహాల్లో విద్యార్థులతో ఈగల్ క్లబ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. పాఠశాలలు, కళాశాలల పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. 1972 టోల్ ఫ్రీ నంబరుపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించాలని, సమాచారం అందించిన వారి వివరాలు ఎవరికీ తెలియవని భరోసా కల్పించాలన్నారు.

నాలుగు వారాల ప్రత్యేక ప్రణాళిక

ఎస్పీ తుహిన్ సిన్హా మాట్లాడుతూ తాటిపర్తి, కోనాం, డౌనూరు, భీమవరం, శ్రీరాంపురాలలో శాశ్వత చెక్ పోస్టులు, 38 వాహన తనిఖీ పాయింట్లు ఏర్పాటు చేశామని, నిరంతర నిఘా, సీసీ కెమెరాలతో పర్యవేక్షిస్తున్నామన్నారు. పటిష్టమైన నిఘా, తనిఖీలతో జిల్లా మీదుగా గంజాయి రవాణా అరికట్టగలిగినట్లు తెలిపారు. ఏజెన్సీ ప్రాంతాల నుండి వచ్చే రైళ్లపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. గంజాయి నిరోధానికి రూపొందించిన నెల రోజుల ప్రత్యేక ప్రణాళిక ప్రకారం మొదటి వారంలో పోలీసు, ఆరోగ్య, సంక్షేమ శాఖల ద్వారా ప్రజల నుంచి గంజాయికి సంబంధించిన సమాచారం సేకరిస్తామని, సేకరించిన సమాచారాన్ని రెండో వారంలో కేటగిరీ వారీగా క్రోడీకరిస్తామని, పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. మూడో వారంలో గంజాయి కార్యకలాపాలపై ప్రత్యేక ఆపరేషన్లు నిర్వహించి, హైరిస్క్ ప్రాంతాల్లో నిఘా పెంచుతామన్నారు. నాలుగో వారంలో కమిటీ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేసి తీసుకున్న చర్యలపై సమీక్షించుకుంటామన్నారు. ఈ సందర్భంగా 1972 టోల్ ఫ్రీ నంబరుపై ప్రజల్లో విస్తృత ప్రచారం కల్పించే ప్రచార పోస్టరును విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఎం.దేవప్రసాద్, ఆర్డీవోలు వి.వి.రమణ, షేక్ ఆయిషా, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి కె.రాజేశ్వరి, డ్రగ్ కంట్రోల్ సహాయ సంచాలకుడు ఎస్.విజయకుమార్, జిల్లా వ్యవసాయ అధికారి బి.మోహనరావు, జిల్లా ప్రజా రవాణా అధికారి కె.పద్మావతి వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

సీతారాములకు సారె


చినదొడ్డిగల్లులో సీతారాములకు గ్రామస్తులు సమర్పించిన సారె

నక్కపల్లి : శ్రీరామనవమిని పురస్కరించుకుని చినదొడ్డిగల్లు గ్రామస్తులు సీతారాములకు ఘనంగా సారె సమర్పించారు. కల్యాణోత్సవాల అనంతరం మూడోరోజు గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు. పలువురు తమకు తోచిన రీతిన సమకూర్చిన సారె పదార్థాలను గ్రామంలో ఊరేగించిన అనంతరం శ్రీరామమందిరానికి తెచ్చి సీతారాములకు సమర్పించారు. శ్రీరామనవమి వేడుకలను గ్రామంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవాలను తొమ్మిదిరోజుల పాటు నిర్వహిస్తున్నారు.

ఈ ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సారె సమర్పించే కార్యక్రమం నిర్వహించినట్టు గ్రామస్తులు తెలిపారు.

తాండవ రిజర్వాయరులో తగ్గుతున్న నీటి నిల్వలు

- ప్రస్తుతం 364.8 అడుగులకు చేరిన నీటి నిల్వలు
- గేట్ల లీకేజీ ద్వారా వృథా అవుతున్న నీరు


తాండవ ప్రాజెక్టులో తగ్గిన నీరు

నాతవరం : ఉమ్మడి జిల్లాలోనే ఏకైక మేజరు ప్రాజెక్టు తాండవ రిజర్వాయరు నీటి మట్టం క్రమేపీ తగ్గిపోతుంది. గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఆయకట్టుకు నీటిని సరఫరా చేసి డిసెంబరు నెలలో ప్రాజెక్టు నుంచి నీటిని నిలుపుదల చేశారు. తాండవ రిజర్వాయరు గేట్లు దించే సమయానికి ప్రాజెక్టులో నీటి మట్టం 369.6 అడుగులు నీరు ఉండేది. ప్రాజెక్టు ప్రధాన గేట్ల ద్వారా నిత్యం నీరు లీకేజీతో పోవడంతో రోజు రోజుకు నీటి మట్టం గణనీయంగా తగ్గిపోతోంది. తాండవలో మంగళవారం సాయంత్రానికి నీటి మట్టం 364.8 అడుగులకు చేరింది. ఆయకట్టుకు నీటిని నిలుపుదల చేసిన దగ్గర్నుంచి నేటి వరకు గేట్ల లీకేజీ ద్వారా సుమారుగా అయిదు అడుగుల నీరు వృధాగా పోయింది, తాండవ రిజర్వాయరు ప్రమాద స్థాయి నీటి మట్టం 380.0అడుగులు కాగా డేడ్ స్టోరేజీ నీటి మట్టం (అంటే బయటకు ప్రవహించదు) 345.0 అడుగులుగా అధికారులు పరిగణిస్తారు. తాండవ రిజర్వాయరు గేట్ల మరమ్మతుల ద్వారా లీకేజీలను అరికట్టేందుకు ప్రభుత్వం రూ.19.70 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో గత నెలలో ప్రధాన గేట్ల మరమ్మతు పనులను ఇరిగేషన్ ఈఈ బాలసూర్యం తాండవ ప్రాజెక్టు డీఈ అనురాధ ఆధ్వర్యంలో ప్రారంభించారు. మేజరు ప్రాజెక్టు గేట్లు మరమ్మతులు కావడంతో అనుభవం ఉన్న మెకానికల్ ఇంజినీరింగ్ అధికారులతో పనులు చేస్తున్నారు. ఆ పనులు సకాలంలో పూర్తి అయితే నిత్యం వృథాగా పోతున్న ప్రాజెక్టులో నీటిని అడ్డుకట్ట వేయవచ్చు. ఈ విషయంపై ప్రాజెక్టు డీఈ అనురాధ మాట్లాడుతూ ప్రస్తుతం తాండవ గేట్ల మరమ్మతు పనులు చేస్తున్నామన్నారు. లీకేజీ నీరు ప్రవహం బాగా తగ్గిందన్నారు. గేట్ల మరమ్మతులు పూర్తి చేసేందుకు మరికొంత మెటీరియల్ రావలసి ఉందన్నారు. అవి వచ్చిన వెంటనే పనులు పూర్తి చేసి లీకేజీలు లేకుండా చేస్తామన్నారు.

సబ్బవరం పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ తుహిన్ సిన్హా


రికార్డులను తనిఖీ చేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా


పోలీస్‌లకు సూచనలిస్తున్న ఎస్పీ

- గంజాయి రవాణాపై వివరాలు సేకరించాలని ఆదేశం

సబ్బవరం: స్థానిక పోలీస్ స్టేషన్‌ను అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదులపై సమీక్షించారు. ప్రధానంగా పేదలు, వృద్ధులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను అర్థం చేసుకుని, వాటి పరిష్కారానికి పోలీస్ సిబ్బంది నిరంతరం కృషి చేయాలని సూచించారు. బేసిక్ పోలీసింగ్‌తోపాటు, విజిబుల్ పోలీసింగ్ ద్వారా ప్రజల్లో నమ్మకాన్ని పెంచుకోవాలన్నారు. రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి సేవించే వివరాలు సేకరించి, అక్రమ రవాణా అరికట్టేందుకు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలన్నారు. మాదకద్రవ్యాల నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నియంత్రణ, సైబర్ నేరాలు, సీసీ కెమెరాల ఏర్పాటుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తరుచుగా నమోదవుతున్న నేరాలు, పెండింగ్ ఫైళ్లను పరిశీలించి ఆయా కేసుల పురోగతిపై సమీక్షించి, తగు సూచనలిచ్చారు. రౌడీ షీటర్లు, చెడు ప్రవర్తన కలిగిన వ్యక్తుల వివరాలను సేకరించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దొంగతనాల నియంత్రణకు గస్తీ విధులు మరింత పటిష్టంగా అమలు చేయాలన్నారు. ఆయన వెంట పరవాడ సబ్ డివిజన్ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, సబ్బవరం సీఐ పిన్నింటి రమణ, ఎస్‌ఐలు సింహాచలం, దివ్య తదితరులున్నారు.

పాస్టర్ ప్రవీణ్ మృతిపై పూర్తి స్థాయి విచారణ చేపట్టాలి


కె.కోటపాడులో పాస్టర్ ప్రవీణ్ మృతిపై నిరసన శాంతి ర్యాలీ చేస్తున్న పాస్టర్లు

కె.కోటపాడు : గత నెల 31న రాజమండ్రిలో అనుమానాస్పదంగా మృతిచెందిన ఫాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పూర్తి స్థాయిలో విచారణ చేసి ఆ కుటుంబానికి సత్వరం న్యాయం చేయాలని కె.కోటపాడు మండల పాస్టర్ ఫెలోషిప్ చైర్మన్ బిషప్ ఎస్.మోజేష్, అధ్యక్షుడు వి.జాన్‌ప్రకాష్ అన్నారు. కె.కోటపాడులో మంగళవారం సాయంత్రం పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై నిరసన శాంతి ర్యాలీ నిర్వహించారు. మోజేష్, జాన్‌ప్రకాష్ మాట్లాడుతూ సుమారు 8 రోజులు గడుస్తున్నా ప్రవీణ్ పగడాల అనుమానాస్పద మృతిపై విచారణ వేగవంతం కాలేదని అన్నారు. ఈ ఘటనలో ఉన్న వారిని త్వరితగతిన పట్టుకుని నిజాలను బయటకు తీయాలని కోరారు. మృతుడు ప్రవీణ్ కుటుంబానికి ప్రభుత్వం అండగా నిలవాలని కోరారు. క్రైస్తవ సమావేశాల నిర్వహణకు ప్రభుత్వం సహకరించాలన్నారు. స్థానిక తహసీల్దార్ డి.రమేష్‌బాబుకు వినతిపత్రాన్ని అందించారు. కార్యక్రమంలో యోహన్, వి.అబ్రహం, జాషువా, మైకేల్, ఆనంద్, సామియల్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భూ వివాదంలో కిరాయి వ్యక్తుల దౌర్జన్యం

- పోలీసులకు ఎ.కొత్తపల్లి బాధిత మహిళల ఫిర్యాదు
- ఐదుగురు వ్యక్తులు పోలీస్‌స్టేషన్‌కు అప్పగింత


ఆవేదన వ్యక్తం చేస్తున్న ఎ.కొత్తపల్లి బాధిత మహిళలు

దేవరాపల్లి : పొలంలోకి వెళ్తున్న తమపై కిరాయి వ్యక్తులు దాడి చేశారని ఎ. కొత్తపల్లి గ్రామానికి చెందిన లక్కరాజు దేముడమ్మ, కంచిపాటి పద్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఎ.కొత్తపల్లిలో 6.80 ఎకరాల భూమిని సుమారు 20 ఏళ్లగా సాగు చేస్తున్నామని, ఈ భూమికి సంబంధించి తమకు, వేరొకరికి కోర్టులో వివాదం నడుస్తుందన్నారు. ఈ భూమిపై తమకు స్టేటస్‌కో ఆర్డర్ కోర్టు ఇచ్చిందన్నారు. అయితే సింగందొరపాలేనికి చెందిన వెలగల పైడంనాయుడు సదరు భూమిని తాను కొనుగోలు చేశానని చెబుతూ తమపై తరచూ దౌర్జన్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈనేపథ్యంలోనే మంగళవారం మధ్యాహ్నం పొలంలోకి వెళ్తుండగా విశాఖపట్నంకు చెందిన సుమారు 30 మంది కిరాయి వ్యక్తులు తమను అడ్డగించి దాడికి తెగబడ్డారని బాధిత మహిళలు ఆరోపించారు. దుర్భాషలాడుతూ ఇక్కడి నుంచి వెళ్లకుంటే తమ వద్ద ఉన్న యాసిడ్‌తో దాడి చేస్తామని బెదిరించారని అన్నారు. సదరు కిరాయి వ్యక్తులను ఎవరని ప్రశ్నించగా తాము కె.కోటపాడు మండలం సింగందొరపాలెంకు చెందిన వెలగల పైడంనాయుడు తాలూకా అని, తమకు టీడీపీ పెద్ద నాయకుల సపోర్టు ఉందని చెప్పి బెదిరించారని బాధిత మహిళలు తెలిపారు. వారిని పట్టుకునే ప్రయత్నం చేయడంతో కొందరు పారిపోగా ఐదుగురిని పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు అప్పగించామన్నారు. తమపై దౌర్జన్యాలకు దిగిన సదరు కిరాయి వ్యక్తులపై కేసు నమోదు చేయాలని కోరుతూ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ఇది ఇలా ఉండగా రెవెన్యూ రికార్డుల ఆధారంగా కొనుగోలు చేసిన భూమిలోకి వెళ్తుండగా తమపైనే ఎ.కొత్తపల్లికి చెందిన వారు దాడి చేశారని, ఇదే విషయమై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్టు వెలగల పైడంనాయుడు తెలిపారు.

కేబుల్ టీవీ కంట్రోల్ రూం దగ్ధం


పూర్తిగా దగ్ధమైన కంట్రోల్ రూం

మాకవరపాలెం : అగ్నిప్రమాదంలో కేబుల్ టీవీ కంట్రోల్ రూం దగ్ధమైంది. మండలంలోని శెట్టిపాలెం గ్రామానికి చెందిన గొర్లి వాసుదేవ నాయుడుకు భీమబోయినపాలెం పంచాయతీ కార్యాలయం పక్కనే కేబుల్ టీవీ కంట్రోల్ రూం ఉంది. అయితే ఇది చెక్కలతో తయారు చేసినది కావడంతో సోమవారం అర్ధరాత్రి దగ్ధమైంది. ఈ ప్రమాదంలో లోపల ఉన్న సుమారు రూ.4 లక్షల విలువ చేసే కేబుల్ టీవీ సామగ్రి పూర్తిగా కాలిబూడిదైంది. ఈ విషయమై ఈ కంట్రోల్ రూం ఆపరేటర్ లాలం ఏసుబాబు పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేసినట్టు తెలిపాడు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టినట్టు అనుమానం ఉందని, పోలీసులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నాడు.

కాంగ్రెస్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం


నూతనంగా ఎన్నికైన జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం

అనకాపల్లి టౌన్ : పట్టణంలోని న్యూకాలనీ రోటరీ హాల్‌లో జిల్లా, అనకాపల్లి పట్టణ, మండల కాంగ్రెస్ కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారం మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న నూతనంగా ఎన్నికైన సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడే వాళ్లకు ఎప్పుడూ గుర్తింపు ఉంటుందన్నారు. కూటమి ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ మాత్రమే ప్రత్యామ్నాయం అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకలు పి.ఎస్ దత్తు, జిల్లా అసెంబ్లీ కో ఆర్డినేటర్లు ఎం.కోటేశ్వరావు, టి.అనంతరావు, ఎం. చక్రవర్తి పాల్గొన్నారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

- రానున్న ఐదురోజులు వర్షాలు పడే అవకాశం


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ముకుందరావు

అనకాపల్లి టౌన్ : జిల్లాలో వచ్చే ఐదురోజులు ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉండి తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసోసియేట్ డైరక్టర్ డాక్టర్ సిహెచ్.ముకుందరావు తెలిపారు. స్థానిక వ్యవసాయ పరిశోధనా స్థానంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్ష సూచన ఉన్నందున కోత దశలో ఉన్న వరి పైరుని కోయడం వాయిదా వేసుకోవాలని, ఒకవేళ ఇప్పటికే కోసి ఉంటే పనలను కుప్పలుగా వేసుకొని టార్పలిన్ కప్పి జాగ్రత్త చేసుకోవాలని అన్నారు. వర్షాలు అనంతరం 80 నుంచి 90 శాతం గింజలు పసుపు రంగులోకి మారుతున్నప్పుడు పంటను కోయాలన్నారు. అలాగే పూత దశలో ఉన్న నువ్వు పైరులో కాయ తొలుచు పురుగు ఆశించే అవకాశం ఉన్నదని, నివారణకు క్లోరిపైరిఫాస్ 2.5 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని, చెరకు కార్సి చేసిన 45 రోజులకు ఎకరాకు 150 కిలోల యూరియాను మొక్కల మొదల్ల దగ్గర చిన్న గుంతలు తీసి వేసుకోవాలని, మెక్కతోటలైతే 45, 90 రోజుల వయసు గల తోటల్లో ఎకరాకు 75 కిలోల యూరియాను మొక్కల మొదళ్ల దగ్గర చిన్న గుంతలు తీసి వేసుకోవాలన్నారు. రాగల వర్షాన్ని వినియోగించుకొని ఖాళీగా ఉన్న పొలాల్లో వేసవి లోతు దుక్కులు దున్నుకోవాలని ఈ విధంగా చేయడం వలన పురుగులు, తెగుళ్ల అవశేషాలు, కలుపు విత్తనాలు భూ ఉపరితలానికి చేరి అవి సూర్యరశ్మి ద్వారా నిర్మూలించబడతాయన్నారు. సమావేశంలో డాక్టర్ టి.శ్రీలత, డాక్టర్ కె.వి.రమణమూర్తి, డాక్టర్ వి.గౌరి పాల్గొన్నారు.

పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని ధర్నా




ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

అనకాపల్లి: కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఆర్.శంకరరావు డిమాండ్ చేశారు. పెంచిన గ్యాస్ ధర తగ్గించాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద పార్టీ నాయకులు ధర్నా చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రజలపై బాదుడు ప్రారంభించిందన్నారు. ఎన్నడూ లేని విధంగా ఒకేసారి రూ.50 పెంచి గ్యాస్ వినియోగదారుల నడ్డివిరిచిందన్నారు. ఇప్పటికే పెరిగిన నిత్యావసర వస్తువులు, విద్యుత్ చార్జీలు కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. పుండు మీద కారం చల్లిన చందంగా మళ్లీ గ్యాస్ ధరలు పెంచడం దుర్మార్గమని, పెట్టుబడిదారులకు, కార్పొరేట్లకు లక్షల కోట్ల రూపాయలు మాఫీ చేస్తున్న ప్రభుత్వం ప్రజలపై భారాలు మోపడం అన్యాయమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఉచిత గ్యాస్ పథకంపైన భారం పడుతుందని, పెంచిన గ్యాస్ ధరలను తగ్గించాలని కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ప్రజలే తగిన బుద్ధి చేప్పేరోజులు దగ్గర పడ్డట్లు హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా నాయకులు వి.వి.శ్రీనివాసరావు, అల్లు రాజు, జి.నాయనబాబు, కె.ఈశ్వరరావు, కె.తేల్లయ్యబాబు, నూకఅప్పారావు తదితరులు పాల్గొన్నారు.

యువకుడి హత్య కేసును ఛేదించిన పోలీసులు

- స్నేహితులే హంతకులని పోలీసుల నిర్ధారణ
- ఇద్దరు యువకులు, మైనర్ బాలుడిపై కేసు నమోదు


సమావేశంలో అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, కొత్తకోట సీఐ కోటేశ్వరరావు, రావికమతం ఎస్ఐ రఘువర్మ

రావికమతం : మేడివాడ యువకుడు కొలిపాక పవన్ కుమార్(22) హత్య కేసును రావికమతం పోలీసులు ఛేదించారు. గర్నికం తిరుమల ఫంక్షన్ హాలు సమీపంలో ఆదివారం అర్ధరాత్రి పవన్ కుమార్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. పవన్‌కుమార్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు మూడు బృందాలతో దర్యాప్తు చేపట్టారు. రావికమతానికి చెందిన అతడి స్నేహితుల ప్రమేయం ఉందని భావించిన పోలీసులు అనుమానితుల కోసం గాలించి మంగళవారం ఇద్దరు యువకులు, మైనర్ బాలుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనకాపల్లి డీఎస్పీ శ్రావణి మంగళవారం రావికమతం పోలీసుస్టేషన్ వద్ద పవన్ కుమార్ హత్యకు సంబంధించిన వివరాలను విలేకరులకు తెలిపారు. అనుమానితులైన వేపాడ నరేంద్ర కుమార్, కేతి దుర్గా ప్రసాద్, మైనర్ బాలుడినిని అదుపులోని తీసుకుని విచారించినట్టు చెప్పారు. మృతి చెందిన పవన్‌కుమార్, వేపాడ నరేంద్ర కుమార్, కేతి దుర్గాప్రసాదుల మధ్య గతం నుంచి గొడవలు ఉన్నాయని, వారు ఎప్పుడూ మద్యం తాగి ఘర్షణ పడుతుండేవారని చెప్పారు. నలుగురూ ఆదివారం మధ్యాహ్నం నుంచి మద్యం సేవిస్తున్నారు. వేపాడ నరేంద్రకుమార్ మద్యం మత్తులో ఉన్నప్పుడు పవన్‌కుమార్ డబ్బులు దొంగిలించాడని ఇద్దరూ గొడవ పడ్డారు. దీంతో నరేంద్రకుమార్ మద్యం సీసాను పగలగొట్టి పవన్‌కుమార్‌పై దాడి చేశాడు. మిగిలిన ఇద్దరూ సహకరించారని డీఎస్పీ శ్రావణి తెలిపారు. హత్య కేసులో ప్రధాన నిందితులు వేపాడ నరేంద్రకుమార్, దుర్గాప్రసాద్ చెన్నై రైల్వేస్టేషన్‌కు సమీపంలో తాళాలు వేసి వున్న ఒక ఇంట్లో చోరీకి పాల్పడ్డారని, నరేంద్రకుమార్ నుంచి ఒకటిన్నర తులాల బంగారం గొలుసు, రూ.35 వేలు నగదును స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

అనకాపల్లి జిల్లా, విశాఖ నగర పరిధిలో వివిధ పోలీసు స్టేషన్లలో మోటర్ సైకిళ్లు, ఇళ్లలో దొంగతనాలకు సంబంధించి గతంలో 10 కేసులు ఉన్నాయని, పలుమార్లు అరెస్టు అయ్యారని చెప్పారు. నిందితులను అరెస్టు చేశామని బుధవారం కోర్టులో పర్చుతామని, మైనర్ బాలుడిని జువైనల్ కోర్టుకు తరలిస్తామని డీఎస్పీ తెలిపారు. ఒక్క రోజులో కేసును ఛేదించిన కొత్తకోట సీఐ కోటేశ్వరరావును, రావికమతం ఎస్ఐ రఘువర్మ, పోలీసు సిబ్బందిని డీఎస్పీ అభినందించారు.

క్లుప్తంగా

అభివృద్ధిలో వెనుకబడిన అనకాపల్లి



మాట్లాడుతున్న ప్రజా సంఘాల నేతలు

అనకాపల్లి టౌన్: జిల్లా కేంద్రంగా ఏర్పడిన అనకాపల్లి పట్టణం అభివృద్ధిలో వెనుకబడి ఉందని జిల్లా ప్రజా సంఘాల ఐక్య వేదిక నేతలు ధ్వజమెత్తారు. స్థానికంగా మంగళవారం జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఏ వీధిలో చూసినా కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. సాయంత్రమైతే దోమలు స్వైర విహారం చేస్తున్నాయని వాపోయారు. పట్టణ సమస్యలపై పలుమార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని వాపోయారు. జీవీఎంసీ కార్యాలయంలో ఒక్క అధికారి కూడా అందుబాటులో ఉండడం లేదన్నారు. జీవీఎంసీ కార్యాలయ ఆవరణలో డంపింగ్ యార్డును తక్షణమే తరలించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో విల్లూరి పైడారావు, బొడ్డేడ అప్పారావు, చిన్ని యాదవ్, ఆళ్ల ప్రవీణ్ కుమార్, కొల్లి చిన్న అప్పారావు, కే మంగరాజు, బొబ్బిలి గోవిందరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ అధికారులపై చర్యలకు డిమాండ్



నిరాహార దీక్షలో కూర్చొన్న ఆర్టీసీ కార్మికులు

అనకాపల్లి టౌన్: తప్పుడు కేసులు రాసిన ఆర్టీసీ అధికారులపై చర్యలు తీసుకోవాలని ఎస్‌ఎంయూపీ రీజనల్ కార్యదర్శి పి. సుధాకర్ డిమాండ్ చేశారు. స్థానిక ఆర్టీసీ బస్ కాంప్లెక్స్ ఆవరణలో కార్మికులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 39వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బస్సు డ్రైవర్ ఎంఏ రావు, కండక్టర్ ఎస్ ఎస్ నారాయణలపై అక్రమ సస్పెన్షను ఎత్తి వేయాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్ రావు, జీ శంకరరావు, కేఎస్ నారాయణ, పీవీఎస్ రావు, బీఆర్ రావు, కేటీ రావు తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు



ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అనకాపల్లి టౌన్: పట్టణంలో ఫుట్‌పాత్ ఆక్రమణలను పోలీసులు తొలగించారు. జీవీఎంసీ సిబ్బంది సహాయంతో ఈ కార్యక్రమం చేపట్టారు. పట్టణ ట్రాఫిక్ సీఐ ఎం వెంకటనారాయణ మాట్లాడుతూ ట్రాఫిక్‌కి ఇబ్బంది లేకుండా వ్యాపారాలు చేసుకోవాలని సూచించారు. ఈ మేరకు పలువురిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ఐ డి. శేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు మంగవారం 2,867 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్టధర	గరిష్టధర
మొదటి రకం	3,480	4,180
రెండో రకం	3,180	3,800
మూడో రకం	2,950	3,170

అనకాపల్లి సినిమాలు

రాజా	:మాడ్ స్క్వేర్
సత్యనారాయణ స్క్రీన్-1	: రాబిన్‌హుడ్
సత్యనారాయణ స్క్రీన్-2	:రాజుగారి దొంగలు
పర్తిసాయి	:కోర్టు
షిర్డీసాయి	:లైఫ్
వెంకటేశ్వర	:ఆదిత్య 369
శ్రీసత్య	:సంక్రాంతికి వస్తున్నాం.
రామచంద్ర	:వీరధీరశూర

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 24 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు , బీ పాజిటివ్-10 యూనిట్లు, ఓ పాజిటివ్-8 యూనిట్లు ఏబీ పాజిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 323 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 204 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నంబరును సంప్రదించవచ్చు.

సిఫార్సులకే బీసీ రుణాలు

కార్పొరేషన్ రుణాలతో స్వయం ఉపాధి పొందాలనుకున్న నిరుద్యోగులకు నిరాశ తప్పడం లేదు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకతకు పాతరేసి సిఫార్సులు ఉన్న వారికే సబ్సిడీ రుణాలు ఇచ్చేలా అధికారులపై ఒత్తిడి పెరుగుతోంది. అనకాపల్లి మండలంలో 800 దరఖాస్తులు రాగా, మొదటి విడతగా 78 యూనిట్లే మంజూరు కావడంతో సిఫార్సు లేఖల కోసం దరఖాస్తుదారులు కూటమి నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

- కూటమి నాయకుల చుట్టూ అభ్యర్థుల ప్రదక్షిణలు
- దరఖాస్తులెక్కువ.. యూనిట్లు తక్కువ
- పది మందిలో ఒక్కరికే అవకాశం



లబ్ధిదారులను ఇంటర్వ్యూ చేసి దరఖాస్తులను స్వీకరిస్తున్న బ్యాంకు ఉద్యోగులు, అధికారులు

తుమ్మపాల: కూటమి ప్రభుత్వంలో సబ్సిడీ రుణాలపై నానా హడావుడి చేసి తీరా పది మందిలో ఒక్కరికే యూనిట్ మంజూరు కానుండటంతో దరఖాస్తుదారులు దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఇటీవల ఆయా కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు సబ్సిడీ రుణాలు ఇప్పించేందుకు అధికారులు కసరత్తు చేపట్టారు. దీనిపై భారీగా ప్రచారం చేయడంతో నోటిఫికేషన్ ఇవ్వడమే తరువాయి అన్నట్లుగా అర్హులైన వారు వందల్లో దరఖాస్తులు చేసుకుంటే, పదుల్లో యూనిట్లు మంజూరు చేసి నాయకుల చుట్టూ తిప్పించుకుంటున్నారు. ఈ మేరకు కూటమి నాయకుల సిపార్సులకే రుణాలు మంజూరు చేసేవిధంగా అధికారులు, బ్యాంకులపై ఒత్తిడి తీసుకువస్తున్నారు.

దాదాపు 800 దరఖాస్తులకు 78 యూనిట్లే మంజూరు

మండలంలోని 32 గ్రామ పంచాయతీల నుంచి 800లకు పైగా దరఖాస్తులు రాగా, కేవలం 78 యూనిట్లు మంజూరు చేసి కూటమి ప్రభుత్వం ప్రజలను మభ్య పెడుతోంది. ప్రచార ఆర్భాటాలతో హడావుడి చేసి నిరుద్యోగుల్లో ఆశలు రేపి బ్యాంకులు కార్యాలయాల చుట్టూ తిప్పించుకుంటున్నారు. మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, కాపు, ఈడబ్ల్యూఎస్ వర్గాల వారీగా యూనిట్లు కేటాయించి, కేవలం 78 యూనిట్లతో పరిమితం చేశారు. దీంతో ఒక్కో బ్యాంకు ఒక్కో రుణాన్ని మాత్రమే ఇవ్వగలమని చెప్పడంతో అర్జీదారులు కార్యాలయాలు, కూటమి నాయకులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంజూరైన 78 యూనిట్లలో కొందరికి వ్యక్తిగతంగా రూ.3 లక్షలు, మరికొందరికి గ్రూపు రుణాల కింద రూ.8 లక్షలు చొప్పున ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. దరఖాస్తులపై గట్టి పోటీ ఉండటంతో చాలా మంది సిఫార్సు లేఖలపైనే ఆధారపడ్డారు.

వైఎస్సార్ సీపీ వారికి అవకాశం లేకుండా...

వైఎస్సార్ సీపీ హయాంలో సబ్సిడీ రుణాలు మంజూరు చేయడానికి గ్రామీణ ప్రాంతాల్లో ఎంపీపీ చైర్మన్‌గాను, ఎంపీడీవో కార్యదర్శిగాను బ్యాంకర్లు సభ్యులుగా ఉంటూ దరఖాస్తుదారులను ఇంటర్వ్యూలు నిర్వహించేవారు. ప్రస్తుతం క్షేత్రస్థాయిలో పాలకవర్గాలు వైఎస్సార్ సీపీకి చెందిన వారే అధికంగా ఉండటంతో ఇంటర్వ్యూల నిర్వహణలో వారికి అవకాశం ఇవ్వకుండా అధికారులు, బ్యాంకుల ప్రతినిధులు మాత్రమే ఉండేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. 50 శాతం సబ్సిడీతో రూ.3 లక్షల వరకు రుణాలు ఇచ్చేందుకు సిద్ధమవ్వడంతో ఎలాగైనా వీటిని పొందాలనుకునే వారికి తమ్ముళ్ల సిఫార్సులే దిక్కయ్యాయి.

సిఫార్సు లేఖల కోసం అగచాట్లు

ఏ విధంగా అయినా సబ్సిడీ రుణాలు పొందాలనే ఆలోచనలతో నిరుద్యోగులతో పాటు కూటమి కార్యకర్తలు అధికంగానే దరఖాస్తులు చేసుకున్నారు. పెద్ద స్థాయిలోని వారితో సిఫార్సు లేఖ తెచ్చుకుంటే తమకు తప్పకుండా సబ్సిడీ రుణం వస్తుందనే నమ్మకంతో ఆశావహులు కూటమిలోని పెద్దలను ఆశ్రయిస్తున్నారు. కొందరు సీనియర్లు సైతం తమకు రుణం ఇప్పించాలని డిమాండ్లు చేయడంతో గ్రామాల వారీగా వివరాలు సేకరించి సిఫార్సులు సిద్ధం చేస్తున్నారు.

11న యూనిట్ల మంజూరుకు ఏర్పాట్లు



కార్పొరేషన్ రుణాలపై గత నెల 27, 29 తేదీలలో బ్యాకు ప్రతినిధుల సమక్షంలో దరఖాస్తుదారులకు ఇంటర్వ్యూలు పూర్తి చేసి ఆయా బ్యాంకులకు దరఖాస్తులను పంపించాం. మొదటి విడతగా 78 యూనిట్లు మంజూరు జరిగాయి. బ్యాంకులు ఎంపిక ఆధారంగా లబ్ధిదారులకు ఈ నెల 11న జ్యోతిరావు పూలే జయంతిని పురస్కరించుకుని యూనిట్లు మంజూరు చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం.

– కె.వి. నరసింహరావు, ఎంపీడీవో అనకాపల్లి మండలం

ఆకుకూరలతో కంటిచూపు మెరుగు



కంటి ఆపరేషన్‌కు విశాఖ వెళ్తున్న రోగులు

అనకాపల్లి: పరిశుభ్రమైన ఆహారం, నిత్యం ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవడం వల్ల కంటిచూపు బాగుంటుందని విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి వైద్యుడు దేవీప్రభాకర్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో రాజా ఆప్టికల్స్ అండ్ కంటి ఆస్పత్రి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి, సాయి రాజా వెల్ఫేర్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా నేత్ర వైద్య శిబిరం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆప్తాలమిస్ట్ మాట్లాడుతూ కంటిని ఆరోగ్యంగా ఉంచుకోవాలని, ఎక్కువగా సెల్‌ఫోన్లు చూడడం వల్ల నేత్రాలు దెబ్బతినే అవకాశాలు ఉంటాయన్నారు. అనంతరం 29 మందిని కంటి ఆపరేషన్లు నిమిత్తం విశాఖ శంకర్ ఫౌండేషన్ ఆస్పత్రికి తరలించారు. వీరికి అన్ని పరీక్షలు చేసి శుక్రవారం ఉచితంగా ఆపరేషన్లు చేస్తామన్నారు. కార్యక్రమంలో సాయి రాజా వెల్ఫేర్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు పూసర్ల రాజా, రోగులు పాల్గొన్నారు.

9 మందిపై కేసు నమోదు

గొలుగొండ : మండలంలో కృష్ణదేవిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో లింగంపేట వద్ద సోమవారం రాత్రి పేకాట ఆడుతున్న 9 మందిపై కేసు నమోదు చేసినట్టు కృష్ణదేవిపేట ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ముందస్తు సమాచారంతో దాడి చేసి 9 మందిని పట్టుకున్నట్టు తెలిపారు. వారి వద్ద నుంచి రూ.5300 స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచామన్నారు.

ఘనంగా పుష్పాంజలి సేవ



పల్లకిలో సీతారాముల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



మహిళల కోలాటాల ప్రదర్శన

కశింకోట: స్థానిక జాతీయ రహదారి పక్కన వెలసిన దేవాదాయ శాఖకు చెందిన కోదండ సీతారామచంద్రమూర్తి స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి పుష్పాంజలి సేవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీరామ నవమి రోజు సీతారాముల కల్యాణాన్ని నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ ఉత్సవాల ముగింపులో భాగంగా యువ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రేజేటి మారుతి, ఈవో ఎస్. సత్యనారాయణమూర్తిల ఆధ్వర్యంలో సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ స్వామివార్ల ఉత్సవ విగ్రహాలను ముందుగా పల్లకిలో మహిళల కోలాటాల మధ్య గ్రామంలో ఊరేగించారు. అనంతరం అందంగా పూలతో అలంకరించిన ఆసనంపై సీతారాముల ఉత్సవ విగ్రహాలకు సంప్రదాయంగా పూజలు నిర్వహించి పుష్పాంజలి కార్యక్రమం పూర్తి చేశారు. భక్తులు ఎక్కువగా దర్శించి పూజలు చేశారు. అర్చకుడు రేజేటి సీతారామాచార్యులు, వార్డు సభ్యుడు కె. సురేష్, బి. త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

15న మండల సర్వసభ్య సమావేశం

అనకాపల్లి టౌన్: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల ప్రజా పరిషత్ 16వ సాధారణ సర్వసభ్య సమావేశం ఈ నెల 15వ తేదీ ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి కేవీ నర్సింహరావు ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ అధ్యక్షుడు గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరిగే సమావేశానికి సభ్యులందరూ హాజరు కావాలని కోరారు.

బకాయి వేతనాల కోసం ఉపాధి కూలీల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధి కూలీలు

పరవాడ: ఉపాధి హామీ పథకం బకాయి వేతనాలను వెంటనే చెల్లించాలని సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రావాడ శివారు రేకవానిపాలెంలో ఉపాధి కూలీలు బకాయి వేతనాలు చెల్లించాలంటూ మంగళవారం నిరసన తెలిపారు. నిరసనలో పాల్గొన్న గనిశెట్టి మాట్లాడుతూ మండలంలో ఉపాధి కూలీలకు చెల్లించాల్సిన రూ.2 కోట్ల బకాయి వేతనాలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 వేతనం చెల్లించి, పేస్లిప్‌లు అందించాలన్నారు. బకాయి వేతనాలు చెల్లించకపోవడంతో ఉపాధి కార్మికుల కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం కల్పించుకుని సమస్యను త్వరితగతిన పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా వరాహ లక్ష్మీనృసింహ స్వామి కల్యాణం



వరాహ లక్ష్మీనృసింహస్వామి వారి కల్యాణోత్సవం



హాజరైన భక్తులు

కశింకోట: స్థానిక పురాతన వరాహ లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి స్వామివారి కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. చైత్ర శుద్ధ ఏకాదశి రోజున నిర్వహించే కల్యాణం పురస్కరించుకొని వేదికపై లక్ష్మీనృసింహస్వామి, లక్ష్మీదేవిల ఉత్సవ విగ్రహాలను అందంగా నూతన వస్త్రాలు, నగలు, పూలమాలలు, తులసీ మాలలతో అలంకరించారు. వేద మంత్రోచ్చరణలు మధ్య శాస్త్రోక్తంగా వేద పండితులు కల్యాణాన్ని కాకర కల్యాణ్, ఆశ దంపతులతో అంగరంగ వైభవంగా జరిపించారు. విష్వేశ్వరుని పూజ, విశ్వక్సేన పూజ, యజ్ఞోపవీతం, శుభ మూహుర్తాన జీలకర్ర, బెల్లం పెట్టడం, మంగళ సూత్రధారణ, తలబ్రాలు పోయడం తదితర అంశాల మేళవింపుతో కల్యాణం జరిపించారు.

భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరై కల్యాణాన్ని కనులారా వీక్షించి భక్తి పారవశ్యం చెందారు. చివరిగా ప్రసాద వితరణ చేశారు. ఆలయ పూజారి అత్తిలి సత్య వెంకట కేశవ కోదండపాణి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. మధ్యాహ్నం రథోత్సవం నిర్వహించారు. భక్తులు ఎక్కువగా దర్శించారు.

సందడిగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల వార్షికోత్సవం



కళాశాల సిబ్బందితో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు తదితరులు

సబ్బవరం: సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాల అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు తెలిపారు. కళాశాలలో మంగళవారం జరిగిన 17వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. డిగ్రీ కళాశాలతో తనకు విడదీయలేని అనుబంధం ఉందన్నారు. కళాశాల వసతులు, సమస్యలపై జిల్లా కలెక్టర్‌తో మాట్లాడి పరిష్కరిస్తానన్నారు. కళాశాలలో వసతుల కల్పనకు రూ.2.3 కోట్లు, ప్రహరీ నిర్మాణానికి రూ.80 లక్షలు మంజూరైనప్పటికీ ఫైనాన్స్ క్లియరెన్స్ రాలేదని ప్రిన్సిపాల్ డాక్టర్ బి.సీతాలక్ష్మి తెలిపారు. ఎమ్మెల్యే రమేష్‌బాబుతో మాట్లాడి, ఫైనాన్స్ క్లియరెన్స్ ఇప్పించే ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కళాశాల ప్రగతి నివేదికను ప్రిన్సిపాల్ చదివి వినిపించారు.

ఆకట్టుకున్న అన్నమాచార్య సంకీర్తన



ఎన్టీఆర్ స్టేడియంలో భక్తి గీతాలు ఆలపిస్తున్న మహిళలు

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి మహోత్సవంలో భాగంగా స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో మంగళవారం రాత్రి నిర్వహించిన అన్నమాచార్య సంకీర్తన, కోలాటాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రూరల్ సీఐ అశోక్‌కుమార్, డాక్టర్ డీడీ నాయుడు పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నెల రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నూకాంబిక దేవస్థానం చైర్మన్ పీలా నాగశ్రీను, తిమ్మాపాత్రుని చక్రవర్తి, సకల గోవిందరావు, గండేపల్లి మురళీ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మరాజుపేటలో అధికారులకు నిరసన సెగ

టీడీఆర్ బాండ్లపై సమావేశమైతే వద్దంటూ నిర్వాసితుల ఆగ్రహం



తిమ్మరాజుపేటలో ఆందోళన చేస్తున్న నిర్వాసితులు



అధికారుల తీరును తప్పపడుతున్న ఉప సర్పంచ్ జగన్

మునగపాక: పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి మంగళవారం తిమ్మరాజుపేటలో టీడీఆర్ బాండ్ల వినియోగంపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో అధికారులకు నిరసన సెగ తగిలింది. స్థానిక సచివాలయ ప్రాంగణంలో తిమ్మరాజుపేట రెవెన్యూ పరిధిలోని నిర్వాసితులకు అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులను ఉద్దేశించి అధికారులు మాట్లాడే ప్రయత్నం చేస్తుండగా, ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్ అడ్డుకున్నారు. నిర్వాసితులకు ఇచ్చే పరిహారాన్ని నేరుగా ఖాతాల్లో జమ చేస్తామని హామీ ఇచ్చాకే మాట్లాడాలని, టీడీఆర్ బాండ్లపై అవగాహన కల్పిస్తామంటే ఒప్పుకునేది లేదని తెగేసి చెప్పారు. ఇందుకు పలువురు నిర్వాసితులు జగన్‌కు మద్దతు పలికారు. దీంతో అధికారులు ఏం చేయాలో తెలియక సమావేశ మందిరం నుంచి బయటకు వచ్చేశారు. అనంతరం నిర్వాసితులంతా తిమ్మరాజుపేట రోడ్డుపై ఆందోళనకు దిగారు. సీపీఎం నాయకులు కర్రి అప్పారావు, బ్రహ్మాజీ తదితరులు మాట్లాడుతూ పూడిమడక రోడ్డు విస్తరణకు సంబంధించి పరిహారాన్ని నేరుగా అకౌంట్‌లో జమ చేయాల్సిందేనన్నారు. రెవెన్యూ అధికారులు గతంలో ఇచ్చిన హామీలు బుట్ట దాఖలయ్యాయన్నారు. 2023 భూ సేకరణ చట్టం అమలు చేయాల్సిందేనన్నారు. ఇప్పటికైనా పునరాలోచించి ప్రతి నిర్వాసితునికి మేలు చేయాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామంటూ హెచ్చరించారు.

డ్వాక్రా సంఘ సభ్యులు ఆర్థికంగా బలపడాలి



డ్వాక్రా సభ్యులతో సమావేశమైన డీపీఎం శ్రీనివాసరావు

మునగపాక: డ్వాక్రా సంఘ సభ్యులంతా ఆర్థికంగా బలపడాలని డీఆర్‌డీఏ డీపీఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని టి.సిరసపల్లిలో మంగళవారం ఆయన డ్వాక్రా సంఘ సభ్యులతో సమావేశం నిర్వహించారు. సంఘ నిర్వహణ, ఆర్థిక లావాదేవీలకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. బ్యాంకు రుణా లు, వాటి చెల్లింపులపై ఆరా తీశారు. బ్యాంకు రుణాలు సద్వినియోగమయ్యేలా చూడాలన్నా రు. ఎప్పటికప్పుడు సంఘ సభ్యులు సమావేశమవుతూ సంఘాలను బలోపేతం చేసుకోవాలన్నారు. సీసీ శ్రీను, వీవోఏ ఉష తదితరులు సమావేశంలో పాల్గొన్నారు.

వాటర్‌బెల్ సమయంలో తప్పక నీరు తాగాలి



విద్యార్థులతో నీటిని తాగించే కార్యక్రమాన్ని పర్యవేక్షిస్తున్న ఎంఈవో ప్రసాద్

కె.కోటపాడు : వేసవికాలం కావడం వల్ల విద్యార్థులు తాగునీటిని ఎక్కువగా తీసుకోవడం ముఖ్యమని మండల విద్యాశాఖాధికారి డీవీడీ ప్రసాద్ అన్నారు. వారాడ ప్రాథమిక పాఠశాలలో మంగళవారం వాటర్‌బెల్ కార్యక్రమంపై విద్యార్థులకు ఆయన అవగాహన కల్పించారు. వేసవి ఉష్ణోగ్రతల కారణంగా డీహైడ్రేషన్ బారిన విద్యార్థులు పడే అవకాశం ఉందన్నారు. అందువల్ల ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రోజు బడి నిర్వహణ సమయంలో ఉదయం 10, 11, 12 గంటల సమయంలో తప్పనిసరిగా ఉపాధ్యాయులు వాటర్‌బెల్ కార్యక్రమాన్ని నిర్వహించాలని ఎంఈవో సూచించారు.

హామీల అమలుపై పోరుబాటకు సిద్ధం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి



సభలో మాట్లాడుతున్న పార్టీ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ

నర్సీపట్నం : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాలు ఏరు దాటాక తెప్ప తెగలేసినట్టు ఉందని, ఎన్నికల హామీల అమలుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు పోరుబాటకు సిద్ధం కావాలని సీపీఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ అన్నారు. సీపీఐ రెండవ మహాసభ గబ్బాడలో మాకిరెడ్డి సత్యనారాయణ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలేపల్లి మాట్లాడుతూ కేంద్రంలో రెండుసార్లు అధికారం చేపట్టిన బీజేపీ ప్రభుత్వ విధానాల వల్ల దేశం సర్వనాశనమైందన్నారు. దేశ సంపదను కార్పొరేట్లకు పరం చేయడానికి ప్రధాని మోదీ కంకణం కట్టుకున్నారని విమర్శించారు. గత ప్రభుత్వంలోనే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానన్న ప్రధాని వాగ్దానం అమలుకు నోచుకోలేదన్నారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి పరిపాలన కొనసాగించడం ప్రజలను మోసం చేయడమే అన్నారు. మహిళలకు ఉచిత బస్సు, అమ్మకు వందనం, రైతు భరోసా వంటి హామీలను తక్షణమే అమలు చేయాలన్నారు. సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు, జిల్లా కార్యవర్గ సభ్యులు డిసిహెచ్. క్రాంతి, నల్లబెల్లి శ్రీరామ్మూర్తి, సీనియర్ నాయకులు పి.గంగాభవాని, మాకిరెడ్డి రాజుబాబు పాల్గొన్నారు.

ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరి రాయితీలు పొందండి



కుముదాంపేటలో విద్యార్థి వివరాలు తీసుకుంటున్న అధ్యాపకులు

బుచ్చెయ్యపేట: ప్రభుత్వ కాలేజీలో చేరి పలు రాయితీలు పొందాలని వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీ అధ్యాపకులు విద్యార్థులకు సూచించారు. మంగళవారం వడ్డాది కుముదాంపేట, భీమవరం తదితర గ్రామాల్లో కాంపెయినింగ్ నిర్వహించారు. పదో తరగతి పాసైన విద్యార్థుల ఇంటికెళ్లి వడ్డాది ప్రభుత్వ జూనియర్ కాలేజీలో చేరాలని, ఉన్నత విద్య అందిస్తామని భరోసా కల్పించారు. మధ్యాహ్న భోజనంతో పాటు నోట్ పుస్తకాలు, పాఠ్య పుస్తకాలు, బ్యాగ్ ఉచితంగా అందిస్తామన్నారు. ప్రైవేటు కాలేజీ యాజమాన్యాల మాటలు వింటే ఆర్థిక ఇబ్బందులు పడతారని, ప్రభుత్వ కాలేజీలో చేరాలని కోరారు. తొలిరోజు పది మంది విద్యార్థులు కాలేజీలో జాయిన్ అవడానికి ముందుకొచ్చారని, రోజూ పలు గ్రామాల్లో కాంపెయినింగ్ ఏర్పాటు చేస్తున్నట్టు ప్రిన్సిపాల్ అన్నపూర్ణ తెలిపారు.